# జీలుగు సాగుతో అధిక దిగుబడులు..

## 50శాతం సబ్సిడీపై జీలుగు విత్తనాల పంపిణీ..

## రైతులకు విత్తనాలను పంపిణీ చేసిన ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి..



చిగురుమామిడి,జనత న్యూస్:వ్యవసాయ పొలంలో రైతులు జీలుగు విత్తనాలు సాగు చేస్తే పొలం సారవంతంగా మారి అధిక దిగుబడులు సాధించవచ్చని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,చిగురుమామిడి సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకట రమణారెడ్డి తెలిపారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి రైతు వేదికలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకట రమణ రెడ్డి, సుందరగిరి గ్రామ సర్పంచ్ జంగ శిరీష రెడ్డిల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై అందజేస్తున్న పచ్చి రొట్ట విత్తనాలు,జీలుగ విత్తనాలను రైతులకు రైతు వేదికలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిగురుమామిడి మండలంనకు 330క్వింటాల్ జీలుగ,50క్వింటళ్ల జనము విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి తాటిపల్లి పున్నం చందర్ రెడ్డి తెలిపారు.భూసారం పెంపునకు జీలుగ పంట చాలా బాగా పని చేస్తుందని,భూమిలోని పోషకాలను మొక్కలకు అందచేస్తుందని రైతులకు తెలిపారు.30కిలోల బస్తా 2.20 ఎకరాల్లో చల్లుకోవాలని,రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మెడబోయిన రాజు,ఏఈవో అంజలి,అఖిల,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్ల దోపిడిపై ఫిర్యాదు



జనత న్యూస్ బెజ్జంకి : ప్రభుత్వ వడ్ల కొనుగోలు కేంద్రాలలో జరుగుతున్న దోపిడి పై సీపీఎం పార్టీ మండల కమిటీ స్థానిక తహసిల్దార్ కు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్ల బస్తా ఇప్పటివరకు 41 కేజీలు తూకం వేశారని, ఇప్పుడు లారీల సాకులు చూపి కొనుగోలును నిర్వాహకులు నత్త నడకన నడిపిస్తున్నారని, అకాల వర్షాల భయంతో ఉన్న రైతుల్ని , మిల్లర్లు, నిర్వాహకులు బస్తాకు 42 కేజీల తూకం తో దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లర్లలు, నిర్వాహకుల అధిక దోపిడి పై చర్యలు తీసుకొని, కొనుగోళ్లలో వేగం పెంచాలని వినతి పత్రంలో డిమాండ్ చేశారు.

# పాత నేరస్తులకు పోలీసుల కౌన్సిలింగ్



జనత న్యూస్ బెజ్జంకి : మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, సస్పెక్టివ్ సీటర్లతో సిద్దిపేట రూరల్ సిఐ విద్యాసాగర్, బెజ్జంకి ఎస్సై తోట తిరుపతి మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి గ్రామాలలో శాంతి భద్రతలకు భంగం కలిగించే ఎటువంటి చర్యలకు పాల్పడవద్దని, గ్రామ వివాదాలు, భూ తగాదాలు, దాడులు, బెదిరింపులు, జూదం, మద్యం సేవించి అల్లర్లు సృష్టించడం, మహిళలను వేధించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. పాత నేర ప్రవృత్తిని విడిచిపెట్టి కుటుంబాలతో సంతోషంగా ఉండాలని సూచించారు.

# జమ్మికుంట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ గౌష్ ఆలం



జమ్మికుంట, మే 26: గౌష్ ఆలం మంగళవారం జమ్మికుంట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు చేరుకున్న సీపీకి ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పూలమొక్క అందించి స్వాగతం పలికారు. తనిఖీ సందర్భంగా సీపీ గౌష్ ఆలం పోలీస్ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. తెలంగాణ పోలీసులు ప్రవేశపెట్టిన జజుచీూ-2.0, ఝా-జ్రూ, ఈ-సాక్ష్య, సైబర్ క్రైమ్ టూల్స్, బాడీ వార్న్ కెమెరాలు వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలపై పూర్తి అవగాహన పెంపొందించుకుని వాటిని రోజువారీ విధుల్లో సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. స్టేషన్‌లోని రికార్డులు, ఎఫ్ఐఆర్ ఇండెక్స్‌ను పరిశీలించిన సీపీ, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గ్రామాలను సెక్టార్లు, సబ్‌సెక్టార్లుగా విభజించి గ్రామ పోలీస్ అధికారులను నియమించాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది విధుల్లో నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని సూచిస్తూ, రిసెప్షన్, పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జమ్మికుంట టౌన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, రూరల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

## చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ గౌష్ ఆలం



జమ్మికుంట, మే 26: గౌష్ ఆలం జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాగంపేట, కోరపల్లి గ్రామ శివార్లలో ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాలను సందర్శించిన సీపీ అక్కడ నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి భద్రతా చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక అక్రమ రవాణా జరగనివ్వబోమని స్పష్టం చేశారు. విధుల్లో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. చట్టాన్ని అతిక్రమించి అక్రమంగా ఇసుక తరలింపుకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కూడా చర్యలు తప్పవని పేర్కొన్నారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, వెంకట్‌తో పాటు స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పశువుల అక్రమ రవాణాపై నిఘా

## హుజూరాబాద్ చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ గౌష్ ఆలం



హుజురాబాద్, మే 26: గౌష్ ఆలం మంగళవారం హుజురాబాద్ పరకాల క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ఈ చెక్‌పోస్టులో రికార్డులను పరిశీలించిన సీపీ, భద్రతా చర్యలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ జిల్లా సరిహద్దుల గుండా పశువుల అక్రమ రవాణా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి, పగలు తేడా లేకుండా వచ్చే భారీ కంటైనర్ వాహనాలు, అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. విధుల్లో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో స్థానిక ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి: సీపీ గౌష్ ఆలం



జమ్మికుంట, మే 26: గౌష్ ఆలం మంగళవారం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో స్థానిక అధికారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం, తహశీల్దార్ వెంకట్ రెడ్డి, జమ్మికుంట టౌన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు. సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు ధాన్యం తీసుకొచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని సూచిస్తూ పోలీస్, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమర్థవంతంగా పనిచేయాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, వెంకట్‌తో పాటు ఇతర శాఖల అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జూన్ మొదటి వారంలో 'కవిత' చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ

## పాంచజన్యంతో పేదలకు న్యాయం చేకూరుస్తాం

## టీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూరెల్ల శ్రావణ్ కుమార్ గౌడ్



హుస్నాబాద్, జనత న్యూస్: తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో జూన్ మొదటి వారంలో హుస్నాబాద్‌లో భారీ ఎత్తున జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ జెండా పండుగ ఇన్‌ఛార్జి పూరెల్ల శ్రావణ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా విచ్చేసి జెండాను ఆవిష్కరిస్తారని ఆయన పేర్కొన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో పార్టీ జెండా గద్దె నిర్మాణం కోసం నాలుగు అనువైన ప్రదేశాలను పరిశీలించి, అనుమతుల కొరకు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినట్లు శ్రావణ్ కుమార్ తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల సాధనే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆవిర్భవించిందని ఆయన స్పష్టం చేశారు.

### నిర్వాసితులకు అండగా ఉంటాం..

హుస్నాబాద్ నియోజకవర్గానికి గుండెకాయ లాంటి గౌరవెల్లి ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన గుడాటిపల్లి, తెనుగుపల్లి గ్రామాల నిర్వాసితులకు ఇప్పటికీ పూర్తిస్థాయి పరిహారం అందకపోవడం శోచనీయమన్నారు. నాటి, నేటి ప్రభుత్వాలు నిర్వాసితుల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో దివంగత వైఎస్సార్ 1.4 టీఎంసీల సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తే, తెలంగాణ వచ్చాక మాజీ సీఎం కేసీఆర్ దీన్ని 8.4 టీఎంసీలకు విస్తరించినప్పటికీ, రైతులకు సాగునీరు అందించడంలోనూ, బాధితులకు న్యాయం చేయడంలోనూ విఫలమయ్యారని విమర్శించారు. నేటి ప్రభుత్వం సైతం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. బాధితులపై పెట్టిన కేసులు ఎత్తివేసి, వారికి పూర్తి న్యాయం జరిగే వరకు టీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

### 'పాంచజన్యం'తో సంక్షేమ పథకాలు..

పార్టీ ప్రకటించిన 'పాంచజన్యం' ద్వారా ప్రజా సంక్షేమానికి ఐదు ప్రధాన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు శ్రావణ్ కుమార్ గౌడ్ వివరించారు. ఇందులో భాగంగా పేదలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించడంతో పాటు రైతులకు గిట్టుబాటు ధర, పంట కొనుగోళ్లపై ప్రభుత్వ గ్యారెంటీ కల్పిస్తామన్నారు. అలాగే నియోజకవర్గంలో పూర్తిస్థాయి సాగునీటి సదుపాయాల కల్పన, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, ప్రతి వర్గానికి సామాజిక న్యాయం చేకూర్చడమే తమ పార్టీ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. రాబోయే 'జెండా పండుగ' ద్వారా ఈ ఐదు అంశాలను ప్రతి ఇంటికీ చేరవేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో టీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు బెజ్జంకి సంజీవ్, అంబాల వెంకటేష్, కొమ్మల కుమార్, రాగటి సందీప్‌లతో పాటు పలువురు యువజన, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

